సాక్షి నిర్మల్
ఆదివారం । 17 । మార్చి । 2024



స్వేచ్ఛగా పరీక్ష రాసేద్దాం..

పరీక్షలు, మార్కులు జీవితానికి పరమావధి కాదు. అయినా చదువుతో సమాజంలో మంచి స్థానం లభిస్తుంది. పదో తరగతి పరీక్షలు మొదలుకానున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆది : 6:27	సోమ : 5:00

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 34.2 /24.4

ఆకాశం చాలావరకు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు చాలా వరకు తగ్గుతాయి. వాతావరణం చల్లబడుతుంది. తుపాను ప్రభావంతో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అందకూర్‌ను సందర్శించిన వైద్య బృందం



పశువుకు టీకాలు వేస్తున్న వైద్యులు

సాక్షి ఎఫెక్ట్..

భైంసాటౌన్: కుంటాల మండలం అందకూర్ గ్రామంలో పశువులు గాలికుంటు వ్యాధిబారిన పడగా, 'ప్రబలుతున్న గాలికుంటు' శీర్షికన శనివారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన పశుసంవర్ధక శాఖ అధికారులు శనివారం అందకూర్ గ్రామాన్ని సందర్శించారు. వ్యాధి బారిన పడిన పశువులను పరిశీలించారు. చికిత్స అందించారు. అలాగే ఇతర పశువులకు నివారణ టీకాలు వేశారు. పశుపోషకులకు మందులు అందజేశారు. జిల్లా పశుసంవర్ధక అధికారి గంగాధరయ్య, డాక్టర్ ప్రకాశ్, సంతోష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న ఏఎస్పీ

భైంసాటౌన్: భైంసా పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహించిన కదం బాలాజీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో 1989 బ్యాచ్‌కు చెందిన ఆయన స్నేహితులు రమణరావు, కె.లక్ష్మణ్, శ్రీనివాస్, రాఘవేంద్రరావు బాధిత కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు శనివారం వారి నివాసంలో ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ చేతుల మీదుగా ఆర్థికసాయం బాధిత కుటుంబానికి అందజేశారు.

టీకాలతో సంపూర్ణ ఆరోగ్యం

- డీఎంహెచ్‌వో డాక్టర్ ధన్‌రాజ్



రిజిస్టర్లు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో..

నిర్మల్: టీకాలు పసి పిల్లల పరిపూర్ణ ఆరోగ్యానికి సంపూర్ణ రక్షణ అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధన్‌రాజ్ అన్నారు. సారంగాపూర్ మండలం ఆలూరులో శనివారం నిర్వహించిన వ్యాక్సినేషన్ ప్రోగ్రాంను ఆయన తనిఖీ చేశారు. టీకాలు వేస్తున్న వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. వ్యాధినిరోధక టీకాలు అనేకం ఉన్నాయన్నారు. గర్భిణులు, చిన్న పిల్లలకు తప్పకుండా టీకాలు వేయించాలని తెలిపారు. ఆయన వెంట జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్‌గౌడ్, ఆరోగ్య కార్యకర్తలు గంగ, నుస్రత్, ఆశ కార్యకర్తలు శ్యామల, రాజ మణి, ప్రమీళ ఉన్నారు.

'కారు'లో కంగారు!

- కవిత అరెస్టయినా.. జిల్లాలో కనిపించని నిరసన
- కాంగ్రెస్‌వైపు నేతల చూపు..
- అయోమయంలో కార్యకర్తలు

నిర్మల్: జిల్లాలో బీఆర్‌ఎస్ పరిస్థితి రోజురోజుకూ మారుతోంది. మారుతున్న నేతల తీరుతో 'కారు' క్యాడర్ కంగారు చెందుతోంది. పదేళ్లు జిల్లాను ఏలిన పార్టీ బీఆర్‌ఎస్సేనా..? అనే పరిస్థితి కనిపిస్తోంది. ఎందుకంటే.. కేసీఆర్ కుమార్తె, తమ పార్టీ ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్టు చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు చేశారు. కానీ.. జిల్లాలో ఖానాపూర్ మండల నేతల ప్రెస్‌మీట్ మినహా ఎక్కడా నిరసన కార్యక్రమం కనిపించలేదు. కనీసం కవిత అరెస్టును ఖండించిన నాయకుడూ లేడు.

మారుతున్న నేతలతో..

జిల్లాలో పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న నేతలు తమ దారి తాము చూసుకోవడంతోనే ఈ పరిస్థితి దాపురించిందంటూ సోషల్‌మీడియాలో ఓ బీఆర్‌ఎస్ కార్యకర్త బాహాటంగానే తన ఆక్రోశం వెల్లగక్కాడు. మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. వాళ్లవెంటే తామన్నట్లుగా ద్వితీయ శ్రేణి నేతలందరూ వెళ్లేందుకు సమాయత్తమవుతున్నారు. ఇక జిల్లాలో నిరసన కార్యక్రమాలు చేసేందుకు కార్యకర్తలను సమన్వయం చేసే లీడర్ లేకుండా పోయారు.

అయోమయంలో..

గులాబీ పార్టీలో ఒక్కసారిగా అయోమయం కనిపిస్తోంది. కవిత అరెస్టుపై పక్కనున్న ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లో పెద్ద ఎత్తున్న నిరసనలు చేపట్టారు. జిల్లాలో మాత్రం కనీస స్పందన కనిపించకపోవడంతో ప్రజలే విస్మయం వ్యక్తం చేస్తున్నారు.







మేఘం కరిగి.. చినుకై కురిసి..

పక్షం రోజులుగా మండుతున్న ఎండలతో ఇబ్బంది పడుతున్న జిల్లా ప్రజలు శనివారం కాస్త ఉపశమనం పొందారు. ఉపరితల ద్రోణి ప్రభావంతో జిల్లాలో ఉష్ణోగ్రతలు కాస్త తగ్గాయి. ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంది. సాయంత్రం ఆకాశంలో మేఘాలు కమ్ముకున్నాయి. రాత్రికి ఆ మేఘాలు కరిగి జిల్లాలో అక్కడక్కడ వర్షం కురిసింది. అకాల వర్షానికి మామిడి రైతులకు నష్టం వాటిల్లింది. పూత, పిందె రాలగా, ఆరబెట్టిన పసుపు, మొక్కజొన్న పంటలు తడిసిపోయాయి. - నిర్మల్‌ఖిల్లా/ఖానాపూర్

బాసర రైల్వేలైన్‌కు కొత్త రూపు



బాసర రైల్వే స్టేషన్‌లో క్రాసింగ్ కోసం నిలిపిన రైలు

- త్వరలో 16 కిలో మీటర్ల డబ్లింగ్ పనులు
- బాసర – నవీపేట్ మధ్య ఆధునికీకరణ
- టెండర్లు ఆహ్వానించిన దక్షిణ మధ్య రైల్వే
- పనులు ప్రారంభమైతే గోదావరిపై మరో వంతెన

భైంసా: బాసర రైల్వేస్టేషన్ నుంచి నవీపేట వరకు 16 కిలోమీటర్ల రైలు మార్గాన్ని ఆధునికీకరించే దిశగా అడుగులు పడుతున్నాయి. డబ్లింగ్, విద్యుదీకరణకు దక్షిణమధ్య రైల్వే అధికారులు ఇటీవల టెండర్లు పిలిచారు. రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని టెండర్ నోటీసులో గడువు విధించారు. టెండర్ ఖరారు కాగానే 16.90 కిలోమీటర్ల మార్గం డబ్లింగ్ పనులు మొదలు కానున్నాయి.

మేడ్చల్ – ముథ్కేడ్ మార్గంలో భాగంగానే...

గతేడాది ఆగస్టులో మేడ్చల్ – ముథ్కేడ్ వరకు 502.34 కిలోమీటర్ల మేర డబుల్‌లైన్ నిర్మాణానికి రైల్వేశాఖ రూ.5,655.40 కోట్లు మంజూరు చేసింది. ఇందులో భాగంగానే బాసర – నవీపేట్ మధ్య డబ్లింగ్ పనులు చేపట్టనున్నారు. మొదట రెండోలైన్ నిర్మించి తర్వాత విద్యుదీకరణ చేపట్టే అవకాశం ఉంది. ఇప్పటికే మేడ్చల్ నుంచి నిజామాబాద్ వరకు పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు చేపట్టేందుకు దక్షిణ మధ్య రైల్వే దశలవారీగా టెండర్లు పిలుస్తూ పనులు చేపడుతోంది.

గోదావరిపై మరో వంతెన...

రైల్వే డబ్లింగ్ పనుల్లో భాగంగా గోదావరి నదిపై మరో వంతెనను ప్రతిపాదించారు. ఇప్పటికే భైంసా – బోధన్ బాన్సువాడ మీదుగా నిర్మిస్తున్న జాతీయ రహదారి పనుల్లో భాగంగా బాసర వద్ద గోదావరి నదిపై నూతన వంతెన నిర్మిస్తున్నారు. రోడ్డు మార్గానికి రెండు వంతెనలు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం రైలు మార్గానికి ఒకే వంతెన ఉంది. డబుల్‌లైన్ పనులు చేపట్టేందుకు మరో వంతెన నిర్మించాలని టెండర్‌లో ప్రతిపాదించారు. బాసర వద్ద గోదావరి నదిపై నాలుగు వంతెనలు కనిపిస్తాయి. ప్రస్తుతానికి రెండు వంతెనలు ఉండగా రోడ్డు మార్గం కోసం మరో వంతెన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

నిర్మాణాలు పూర్తయితే...

మేడ్చల్ నుంచి ముథ్కేడ్ వరకు 502.34 కిలో మీటర్ల డబుల్‌లైన్ నిర్మాణాలు పూర్తయితే విద్యుత్ రైల్వేమార్గంగా విస్తరి స్తారు. ఈ పనులు పూర్తయ్యాకే చదువుల తల్లి క్షేత్రం బాసర మీదుగా మహారాష్ట్రవైపు వేగంగా వెళ్లే రైళ్లలో ప్రయాణించే అవకాశం దక్కుతుంది. వందే భారత్ రైళ్లు కూడా ఈ మార్గంలో నడిపించే అవకాశం ఉంటుంది. సింగిల్ ట్రాక్ ఉండడంతో రైళ్ల వేగం బాగా తక్కువగా ఉంది. బాసర మీదుగా నాందేడ్, ఔరంగాబాద్, ముంబై వరకు ప్రతీరోజు గూడ్స్ రైళ్లు వెళ్తుంటాయి. సింగిల్ ట్రాక్‌లో గూడ్స్ రైళ్ల రాకతో రైళ్లలో ప్రయాణించే యాత్రికులు గంటల తరబడి నిరీక్షిస్తున్నా రు. టెండర్లు త్వరగా పూర్తి చేసి పనులు మొదలు పెట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వందేళ్లుగా సింగిల్‌లైనే...

మహారాష్ట్రలోని ఔరంగాబాద్ నుంచి హైదరాబాద్ వరకు వందేళ్ల క్రితమే నిజాంకాలంలో ప్రత్యేక రైల్వే ట్రాక్ నిర్మించారు. పురాతనమైన ఈ మార్గం ఇప్పటికీ డబ్లింగ్‌కు నోచుకోలేదు. సింగిల్ ట్రాక్‌పైనే రైళ్ల రాకపోకలు కొనసాగుతున్నాయి. దీంతో ఒక్కో స్టేషన్‌లో ఎదురుగావస్తున్న రైళ్ల క్రాసింగ్ కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. డబ్లింగ్ పనులు పూర్తయితే సమస్య పూర్తిగా తీరుతుంది. జాతీయ సగటుతోపోలిస్తే తెలంగాణలో రైల్వేమార్గం చాలా తక్కువ. ఉన్న మార్గంలోనూ సింగిల్ ట్రాక్‌లే ఉన్నాయి. సికింద్రాబాద్ నుంచి మహారాష్ట్రలోని నాందేడ్ వరకు ఇప్పటి వరకు వేగం తక్కువ ఉన్న రైళ్లలోనే ప్రయాణం చేస్తున్నారు. విద్యుదీకరణ పూర్తయితే రైళ్ల వేగం పెరుగుతుంది.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లాలో 8,923 మంది విద్యార్థులు సిద్ధం
- 47 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ
- 5 నిమిషాలు ఆలస్యమైనా అనుమతి
- డీఈవో రవీందర్‌రెడ్డి



రవీందర్‌రెడ్డి డీఈవో

నిర్మల్ రూరల్: పదో తరగతి పరీక్షలు జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 47 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 8,923 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు. సోమవారం నుంచి పదో తరగతి వార్షిక పరీక్షల ప్రారంభం అవుతున్న నేపథ్యంలో పరీక్షల ఏర్పాట్లపై డీఈవో 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరాలు వెల్లడించారు.

సాక్షి : జిల్లాలో ఎంతమంది పదో తరగతి పరీక్షలు రాయనున్నారు?

డీఈవో : జిల్లా పరిషత్, మండల పరిషత్, ఉన్నత పాఠశాలలు, ఆదర్శ, కస్తూరిబా, గురుకులాలు, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 8,923 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. ఇందులో ప్రైవేట్ విద్యార్థులు 2,873, గవర్నమెంట్ విద్యార్థులు 6,050 ఉన్నారు. వీరిలో 4,309 మంది బాలురు, 4,614 బాలికలు ఉన్నారు.

సాక్షి : జిల్లాలో ఎన్ని పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు?

డీఈవో : జిల్లాలో మొత్తం 47 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఇందులో 23 ఏ సెంటర్లు 17 బీ సెంటర్లు 07 సి సెంటర్లుగా గుర్తించాం. ఇందులో 43 రెగ్యులర్ విద్యార్థుల కోసం, 04 కేంద్రాల్లో ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాం.

సాక్షి : మెరుగైన ఫలితాల కోసం ఎలాంటి చర్యలు తీసుకున్నారు ?

డీఈవో : పదో తరగతి ఫలితాల్లో గతేడాదిలాగానే ఈ ఏడాది కూడా జిల్లాను రాష్ట్రంలో నంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేశాం. విద్యార్థుల సామర్థ్యం ఆధారంగా ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించాం. సీ కేటగిరీ విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చారు. సందేహాలు నివృత్తి చేశారు. పరీక్షలపై భయం తొలగించేలా ఇప్పటికే ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించాం.

సాక్షి : పరీక్షల నిర్వహణకు ఎంతమంది సిబ్బందిని కేటాయించారు?

డీఈవో : పదో తరగతి వార్షిక పరీక్షలకు 47 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 47 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 600 మంది ఇన్విజిలేటర్లు, కేంద్రంలో 300 మంది విద్యార్థుల కంటే ఎక్కువగా ఉంటే అదనపు డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించాం. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు తాగునీరు, ఫ్యాన్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాం.

సాక్షి : నిమిషం నిబంధన అమలులో ఉందా ?

డీఈవో : విద్యార్థులకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా కేంద్రంలోకి అనుమతిస్తాం. దాదాపు ఆలస్యం కాకుండా విద్యార్థులు చూసుకోవాలి. గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి.

సాక్షి : పరీక్ష కేంద్రాల వద్ద నిబంధనలు ఎలా ఉంటాయి?

డీఈవో : పరీక్ష కేంద్రం, పరిసర ప్రాంతాలలో 144 సెక్షన్ ఉంటుంది. విద్యార్థులు ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్లు తీసుకు రావద్దు. అధికారులందరూ నిబంధనల ప్రకారం విధుల్లో అప్రమత్తంగా ఉండాలి. సిబ్బంది కూడా ఎలాంటి మొబైల్ ఫోన్లు తీసుకురావొద్దు.

సాక్షి : విద్యార్థులకు మీరు ఇచ్చే సూచనలు ఏమిటి?

డీఈవో : విద్యార్థులందరూ ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి. ఇప్పటికే హాల్ టికెట్లను చేరవేశాం. అందని వారు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలు రాయాలి. సందేహాల నివృత్తికి టోల్‌ఫ్రీ నంబరు 9059987730 సంప్రదించాలి.

పకడ్బందీగా పార్లమెంటు ఎన్నికలు

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన ఎస్పీ జానకీషర్మిల తదితరులు

నిర్మల్‌చైన్‌గేట్: పార్లమెంట్ ఎన్నికలు అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సెక్టార్, రూట్, పోలీస్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్టార్, రూట్, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగ ఓటర్ల కోసం ర్యాంప్ సౌకర్యం, వేసవి దృష్ట్యా తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్, అత్యవసర వైద్య సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎన్నికల సమస్యలపై ఫిర్యాదు చేయడానికి తెచ్చిన సీ విజిల్ యాప్, ఎన్నికల టోల్‌ఫ్రీ నంబరు – 1950 పై అవగాహన కల్పించాలన్నారు. రూట్ ఆఫీసర్లు పోలింగ్ కేంద్రాల రూట్ మ్యాప్‌ను పది రోజుల్లో అధికారులకు అందించాలన్నారు. ఈవీఎం కమిషనింగ్‌లో భాగంగా ఈవీఎంల పనితీరుపై సిబ్బంది అవగాహన పెంచుకోవాలని చెప్పారు. పోలింగ్ జరిగే రోజు సెక్టార్ అధికారులు కనీసం మూడుసార్లు పోలింగ్ కేంద్రానికి వెళ్లి, ఎన్నికల సరళిని పరిశీలించాలని పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. 12డీ ఫాంకి సంబంధించిన సమాచారాన్ని అధికారులకు వివరించారు.

ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలి

రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం నిబంధనలను పాటించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కలెక్టరేట్ సమావేశం మందిరంలో వివిధ రాజకీయ పార్టీల నేతలతో శనివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. సమావేశాలు, ర్యాలీలకు అనుమతి తీసుకోవాలన్నారు. ప్రశాంతవంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు. ఎన్నికల సందర్భంగా సువిధ పోర్టల్‌లో రాజకీయ నాయకులు అనుమతులు తీసుకోవాలని, ర్యాలీల సందర్భంగా భారీ శబ్దంతో కూడిన డీజేలు నిషేధమన్నారు. ప్రభుత్వ స్థలంలో ఉన్న రాజకీయ ప్రచార పోస్టర్లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రైవేట్ ప్రాంతాల్లో రాజకీయ పోస్టర్లు ఏర్పాటు చేస్తే వారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, డీఎస్పీ గంగారెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో..

పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం మాట్లాడారు. జిల్లాలో మొ త్తం 7,34,824 ఓటర్లు ఉన్నారని, మొత్తం 922 పో లింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తామన్నారు. డబ్బు, మద్యం పంపిణీపై ప్రత్యేక నిఘా ఉంటుందని పేర్కొన్నారు. 85 ఏళ్లు నిండిన వారికి ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పిస్తామని చెప్పారు. సువిధ పోర్టల్ ద్వారా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్లు అఫిడవిట్‌కు సంబంధించిన వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. సీవిజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసిన 100 నిమిషాలల్లో సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

స్వీయ నియంత్రణ కలిగి ఉండాలి..

ఎన్నికల ప్రచార సమయంలో రాజకీయ నాయకులు వివాదాస్పద వ్యాఖ్యలు చేయకుండా స్వీయ నియంత్రణ కలిగి ఉండాలని ఎస్పీ జానకి షర్మిల సూచించారు. కుల మతాలను రెచ్చగొట్టే విధంగా, వ్యక్తిగత దూషణలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. 50 వేలకు మించి నగదు తీసుకెళ్లే సమయంలో అనుమతి పత్రాలు ఉండాలన్నారు. లైసెన్స్ ఉన్న తుపాకులను వెంటనే పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని ఆదేశించారు. మహారాష్ట్ర సరిహద్దుల్లో ఏడు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, డీపీఆర్వో విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

'ఏనుగు' పార్టీలో అయోమయం !

- 'ఆర్‌ఎస్పీ' రాజీనామాతో సందిగ్ధంలో కేడర్
- బీఆర్‌ఎస్‌లో చేరుతారనే ప్రచారం



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్(ఆర్‌ఎస్పీ) ఆ పార్టీని వీడడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆయన వెంట నడిచిన నాయకులు, కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. బహుజనవాదంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన సిర్పూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఒక దశలో ఆయన గెలుస్తారనే ధీమా కేడర్‌లో నింపారు. కానీ ఆయన మూడో స్థానానికి పరిమితం అయ్యారు. ఆ తర్వాత కూడా పలుమార్లు సిర్పూర్ నియోజకవర్గానికి వచ్చారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్, బీఎస్పీ పొత్తు తెరపైకి రావడం తెలిసిందే. దీంతో నియోజకవర్గంలో తన ఓటమికి కారణమైన ఆర్‌ఎస్పీతో పొత్తును నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కోనేరు కోనప్ప తన సోదరుడు జెడ్పీ చైర్‌పర్సన్ కృష్ణారావు, నాయకులతో సహా కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాజాగా ప్రవీణ్‌కుమార్ బీఎస్పీ వీడడంతో బీఆర్‌ఎస్‌లో చేరుతారనే ప్రచారం మొదలైంది. దీనిపై ఆర్‌ఎస్పీ ఎలాంటి నిర్ణయం వెల్లడించలేదు. నాగర్‌కర్నూల్ నుంచి ఎంపీగా పోటీ చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

బలం పెరిగి, బలహీన పడి..

రాష్ట్రంలో బీఎస్పీకి అధ్యక్ష హోదాలో మాజీ ఐపీఎస్ ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ ఉండడంతో ఉమ్మడి జిల్లాలో పార్టీకి ఆదరణ ఉంటుందని కేడర్‌లో నమ్మకం పెరిగింది. ఆయన పోటీ చేసిన స్థానంలోనైనా గె లుస్తారనే నమ్మకం కల్పించారు. ఇందుకోసం ఉమ్మ డి ఆదిలాబాద్ జిల్లాలోనూ పార్టీ బలోపేతం చేయాలని అసెంబ్లీ ఎన్నికల ముందు తీవ్రంగా శ్రమించా రు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం కోస్నిలోనే నివాసం ఏర్పర్చుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని పది స్థానాల్లో తమ అభ్యర్థులను ఎన్నికల బరిలో దింపారు. 2014లో నిర్మల్ నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, సిర్పూర్‌లో కోనేరు కోనప్ప బీఎస్పీ నుంచే పోటీ చేసి ఏనుగు గుర్తుపైనే గెలిచారు. అదే నమ్మకంతో సిర్పూర్‌లో ఆర్‌ఎస్పీ బరిలోకి దిగారు. సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ కార్యదర్శిగా పని చేసి న పరిచయాలు, 'స్వేరో' సైన్యం, దళిత, బీసీ, మై నార్టీల మద్దతుతో పార్టీని బలోపేతం చేశారు. చా లామంది మాజీ ఐపీఎస్ పిలుపుతో పార్టీలో చేరా రు. గత ఎన్నికల్లో ఆశించిన తీరులో పార్టీ ఫలితాలు రాకపోవడంతో కేడర్ నిరాశ చెందారు. తాజాగా లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆదిలాబాద్, పెద్దపల్లి నుంచి ఆశావహులు పోటీలో ఉంటారని ప్రణాళికలు వేస్తున్నారు. అయితే పార్టీ అధ్యక్షుడి రాజీనామాతో ఏం చేయాలనే సందిగ్ధంలో పడ్డారు. కొంతమంది పార్టీ ని వీడేందుకు సిద్ధంగా ఉండగా, మరోవైపు బీఎస్పీలోనే కొనసాగేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

నిర్లక్ష్యం చిదిమేసింది!

- మినీట్రాన్స్‌పోర్ట్ వాహనం కింద నలిగి చిన్నారి మృతి
- ఇంటి ముందు ఆడుకుంటుండగా ఘటన



అనయా ఫాతిమా(ఫైల్)

దిలావర్‌పూర్: అజాగ్రత్త, నిర్లక్ష్యంతో కూడిన డ్రైవింగ్ ఓ చిన్నారిని చిదిమేసింది. అప్పటి వరకు ఇంటి ముందు ఆడుకుంటున్న 15 నెలల పాప పాలిట అటుగా వచ్చిన మినీట్రాన్స్‌పోర్ట్ వాహనం మృత్యుశకటమైంది. రెప్పపాటులో చిన్నారి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఈ విషాద ఘటన దిలావర్‌పూర్ మండలం కంజర్ గ్రామంలో శనివారం సాయంత్రం జరిగింది. ఎస్సై సుమాంజలి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని భారత్‌గ్యాస్ ఏజెన్సీకి చెందిన గ్యాస్ డోర్‌డెలిరీ వాహనం కంజర్ గ్రామానికి చేరుకుంది. అంతర్గత రోడ్డు గుండా వెళ్తుండగా డ్రైవర్ అజాగ్రత్తగా వాహనం నడుపడంతో ఇంటి ముందు ఆడుకుంటున్న అనయా ఫాతిమ(15 నెలలు) వాహనం చక్రాలకింద పడి అక్కడికక్కడే మృతిచెందింది. శబ్దం రావడంతో కుటుంబ సభ్యులు ఇంట్లో నుంచి బయటకు వచ్చి చూడగా చిన్నరి విగత జీవిగా కనిపించింది. అప్పటి వరకు ఆడుకున్న చిన్నారిని అరక్తపు మడుగులో చూసి తండ్రి షేక్ అబ్దుల్ సాదిక్ కన్నీరు మున్నీరుగా విలపించాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కడెం: మండలంలోని చిట్యాల్ గోదావరి రేవు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్‌ను తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కడెం మండలంలోని నర్సింగాపూర్‌లో పీడీఎస్ బియ్యం తరలిస్తున్న బొలేరో వాహనాన్ని శుక్రవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. పట్టుబడిన యాభై క్వింటాళ్ల బియ్యం, వాహనాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఫుడ్ లైసెన్స్ తప్పనిసరి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలో వ్యాపారాలు నిర్వహించే వారందరూ ఫుడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని ఫుడ్‌సేఫ్టీ అధికారి వాసురాం సూచించారు. జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లు, పాల కేంద్రాలను శనివారం తనిఖీ చేశారు. శుభ్రత పాటించని 3 హోటళ్లు, 3 పాల కేంద్రాలకు అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ ఆదేశాల ప్రకారం రూ.1,92,000 జరిమానా విధించారు. ఫుడ్ లైసెన్స్ లేనివారికి ఆరు నెలలు జైలు, రూ.5 లక్షల జరిమానా విధించబడుతుందని తెలిపారు.

ఆటో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రాంనగర్‌కు కాలనీకి చెందిన మహ్మద్ మూసాకు చెందిన ఆటో శుక్రవారం రాత్రి చోరీకి గురైంది. ఈద్గా వద్ద గల మజీద్‌లో నమాజ్ వెళ్లారు. నమాజ్ తర్వాత రాత్రి 11గంటల తర్వాత తిరిగి వచ్చి చూసే సరికి ఆటో కన్పించకుండా పోయింది. దీంతో చుట్టు పక్కల గాలించినప్పటికీ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపారు.

పోస్టల్ అధికారిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ప్రధాన పోస్టాఫీసు మేనేజర్ జాదవ్ విజయ్‌పై టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సదరు మేనేజర్ పోస్టాఫీసులో ఖాతా కలిగిన రైతులకు సంబంధించి డబ్బులు రూ.36లక్షలు రైతుల అకౌంట్‌లో కాకుండా సొంత అకౌంట్‌లో వేసుకుని మోసానికి పాల్పడ్డాడు. ఈ మేరకు హబిట్స్ హైదరాబాద్ జరనల్ పోస్టాఫీసు చీఫ్ మేనేజర్ భూక్యా భాస్కర్ నాయక్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

'మిషన్ భగీరథలో శ్రమ దోపిడీ అరికట్టాలి'

నిర్మల్‌చైన్‌గేట్: మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇచ్చి పీఎల్ఆర్ కంపెనీ శ్రమ దోపిడీని అరికట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నిర్మల్ జిల్లా కమి టీ అధ్యక్షుడు డాకూర్ తిరుపతి డిమాండ్ చేశా రు. ఈమేరక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవోకు శనివారం వినతిపత్రం అందించారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ కడం ప్రాజెక్టు నుంచి మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందిస్తున్న పీఎల్ఆర్ కంపెనీ వాటర్ సప్లయ్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. రూ.16 వేల కనీస వేతనం చెల్లించాల్సి ఉండగా, రూ.8 వేల మాత్రమే చెల్లిస్తుందని తె లిపారు. 70 నుంచి 80 మంది కార్మికులు పని చేస్తుంటే 150 మంది పని చేస్తున్నట్టుగా తప్పు డు లెక్కలు చూపి ప్రభుత్వం నుంచి డబ్బులు కాజేస్తున్నారని ఆరోపించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్, జిల్లా నాయకుడు చందుల సాయికిరణ్ ఉన్నారు.

స్వేచ్ఛగా పరీక్ష రాసేద్దాం..



- రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు
- ఒత్తిడి అధిగమిస్తే విజయం మీదే..
- ఆశావహ దృక్పథంతో హాజరుకండి..
- విద్యారంగ నిపుణులు, విజేతలు, మనోవికాసవేత్తల సూచన

నిర్మల్‌ఖిల్లా: పరీక్షలు, మార్కులు జీవితానికి పరమావధి కాదు. అయినా చదువుతో సమాజంలో మంచి స్థానం లభిస్తుంది. పాఠశాల స్థాయి దాటేందుకు వారధిలాంటి పదో తరగతి పరీక్షలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. అయితే తొలిసారి బోర్డు పరీక్షలు రాయనున్న విద్యార్థులు కొంతమేర ఒత్తిడి, ఆందోళన సహజంగానే ఉంటుంది. స్వేచ్ఛాయుత వాతావరణంలో పరీక్షలకు హాజరైతే ఆకాశమంత ఆత్మవిశ్వాసం కలిగి ఉత్తమ ఫలితాలు రాబట్టవచ్చని అంటున్నారు. ఏడాదంతా నేర్చుకున్న చదువును ప్రదర్శించేందుకు ఇదొక మంచి అవకాశంగా భావించాలని విద్యారంగ నిపుణులు, విజేతలు, మనోవికాసవేత్తలు సూచిస్తున్నారు. పదో తరగతి పరీక్షలు మొదలుకానున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం...

8923 మంది విద్యార్థులు...

పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అయితే నిర్మల్ జిల్లాలో దాదాపు 8,923 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. విద్యార్థులు పరీక్షలను ఆశావాహ దృక్పథంతో, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొంటే మంచి ఫలితాలను అలవోకగా సాధించవచ్చని విద్యావేత్తలు, నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మరికొన్ని ముఖ్య సూచనలు...

- విద్యార్థి తెలివితేటలను హరించి వేసేది ఒత్తిడి. మొదట ఒత్తిడిని దరిచేరనీయవద్దు. ఈ పరీక్షలు కేవలం పైతరగతులకు వెళ్లేందుకే ఉద్దేశించినవనే ధోరణితో పరీక్షలకు హాజరు కావాలి.
- పరీక్షలే జీవిత సర్వస్వం కాదని గుర్తించాలి. నమ్మకమే మనిషిని నడిపిస్తుంది. విజయం సాధించేందుకే మనమున్నామనే బలమైన ఆశావహ దృక్పథాన్ని కలిగి ఉంటే విజయానికి బాటలు వేస్తుంది.
- విద్యార్థులకు 10/10 రావడం ఒక్కటే జీవితంలో ప్రధాన లక్ష్యం కాదని గుర్తించాలి. ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో గుర్తించి ఆ విషయంలో ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలి.
- పరీక్షలకు సన్నద్ధమయ్యే క్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి అవసరమైన వాటిని సమకూర్చాలి.

ఆందోళన జయిస్తే గెలుపు మీదే...



విద్యార్థులకు సమయ పాలన చాలా ముఖ్యం. చేయగలిగే లక్ష్యాలను మాత్రమే ఎంచుకోవాలి. ప్రశ్న పత్రంలో కూడా అదే విధంగా తగిన ప్రశ్నలకు సమాధానాలు ఎంచుకున్న తర్వాత వాటి సమాధానాలను రాస్తూ వెళ్లే క్రమంలో ఏదైనా మర్చిపోతే అక్కడే ఆగిపోకుండా ముందుకెళ్లాలి. పరీక్షల సమయంలో తగిన నిద్ర ఉంటేనే చదువుకున్నది గుర్తుంటుంది. అందుకే ప్రతిరోజు దాదాపు 6 నుండి 8 గంటలు పడుకోవాలి. ప్రణాళిక ప్రకారం చదువుకోవాలి. పరీక్షలను సరిగా రాయలేకపోతున్న విద్యార్థులు కృంగిపోవాల్సిన అవసరం లేదు. చదివే సర్వస్వం కాదు. తల్లిదండ్రులు పిల్లలను చదువు పట్ల ఎక్కువ ఒత్తిడి చేయవద్దు.

– భూమన్న యాదవ్, మనోవికాస నిపుణులు, మోటివేషనల్ స్పీకర్, నిర్మల్

పాఠశాలల్లో రాసే పరీక్ష లాంటివే..



విద్యార్థులకు పరీక్షల రాయడం కొత్త కాదు. ఏడాదంతా నెల, త్రైమాసిక, అర్ధ వార్షిక పరీక్షలు రాస్తూనే ఉంటారు. కాకపోతే ఇతర పరీక్ష కేంద్రంలో రాస్తున్నామని భయం వారిని తొలచివేస్తుంది. ఆ భయాన్ని వీడాలి. క్రమశిక్షణతో కూడిన కార్యాచరణను అమలుపరిస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయి. మన భవిష్యత్ కోసం మనం కష్టపడుతున్నామనే భావనను పెంపొందించుకొని కాలక్షేపం వంటి వాటికి దూరంగా ఉండాలి. టీవీ, మొబైల్ ఫోన్ వంటి వాటితో సమయాన్ని వృథా చేయవద్దు. ప్రిపరేషన్ సమయంలో మధ్య మధ్యలో స్వల్ప విరామం ఇవ్వాలి. పరీక్ష సమయానికి కనీసం రెండు గంటల ముందు చదవడం ఆపేసి ప్రశాంతంగా గడపాలి.

– డాక్టర్ బి.సాయిప్రసన్న, ఎంబీబీఎస్ వైద్య విద్యార్థిని, చించోలి–బి.

ఆశావహ దృక్పథం అవసరం..



ఒక పరీక్ష రాశాక దాని గురించి పూర్తిగా మర్చిపోవాలి. విద్యార్థుల దృష్టి తర్వాతి రోజు రాయనున్న పరీక్షపైనే కేంద్రీకరించాలి. ఫలానా ప్రశ్నకు సమాధానాన్ని సరిగా రాయలేదని భావనను మనసులోనికి రానీయకూడదు. మార్కుల గురించి ఆలోచనలు వదిలివేయాలి. ప్రశాంతంగా ఉంటేనే మెదడు చురుకుగా పనిచేస్తుంది. మధ్య మధ్యలో కాస్త విరామం ఇస్తూ సాధన చేయాలి. బాగా రాయదగిన అంశాలను ముందుగా ఎంచుకొని సమాధానాలు రాయడం ఉత్తమం. చేతిరాత బాగుండేలా సాధన చేయాలి. ప్రతిరోజు తగిన మోతాదులో దాదాపు 6 నుండి 8 గ్లాసుల నీళ్ల తాగాలి.

–రవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్

ఆర్జీయూకేటీలో కథక్ ప్రదర్శన



ప్రదర్శనలో విద్యార్థులు

భైంసా: బాసర ఆర్జీయూకేటీలో శనివారం కథక్ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. స్పిక్‌మెకే (సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ అమోంగ్స్ యూత్) తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో చేపట్టిన కథక్ వర్క్‌షాప్ డెమోన్‌స్ట్రేషన్ ప్రోగ్రాం ఈనెల 11 నుంచి బాసర, ముథోల్ మండలాల పరిధిలోని పది పాఠశాలల్లో కథక్ నృత్యప్రదర్శన నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమం బాసర ట్రిపుల్ ఐటీలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కథక్ నృత్యకారిణి సృష్టి జునార్కర్ ప్రదర్శన ఆకట్టుకుంది. ఈనెల 11 నుంచి జిల్లా విద్యాశాఖ సౌజన్యంతో జెడ్పీహెచ్‌ఎస్ ఆష్ట, జెడ్పీహెచ్‌ఎస్ (ఉ/మీ) బాసర, జెడ్పీహెచ్‌ఎస్ కౌట, టీఎమ్మార్‌ఈఐఎస్ ఐఎస్ ముథోల్, జెడ్పీహెచ్‌ఎస్ (బాలికల) బాసర, కేజీబీవీ ముథోల్, జెడ్పీహెచ్‌ఎస్ (బాలికల) మథో ల్, టీడబ్ల్యూ ఆశ్రమ పాఠశాల ముథోల్, జెడ్పీహెచ్‌ఎస్ ముథోల్ పాఠశాలలో ప్రదర్శన నిర్వహించారు.

ముగింపు..

ఆర్జీయూకేటీలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. సృష్టి మొదటగా తమ గురువులను తలుచుకుంటూ గురు వందనతో నృత్యం ప్రారంభించిన ఆమె, తన హావభావాలతో శ్రీకృష్ణుని కోసం వెతుకుతున్న గోపికలను చూపించి అందరినీ మైమరిపించింది. కార్యక్రమంలో ఆర్జీయుకేటి బాసర స్పెషల్ ఆఫీసర్ సృజన, స్పిక్‌మెకే తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ రాకేశ్‌రెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ కుమారి రచన పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి



బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: విద్యార్థులు చదువుతోపాటు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లోనూ రాణించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల మైదానంలో శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి 8వ ఇంటర్ జూనియర్ (బాలికల) సాఫ్ట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి క్రీడాకారిణులకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. మొదటి స్థానంలో నిజామాబాద్ జట్టు, ద్వితీయ స్థానంలో ఆదిలాబాద్ జట్టు, తృతీయ స్థానంలో మహబూబ్‌నగర్ జట్లు నిలిచాయి. ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ అధ్యక్షుడు ఏలేటి రవిందర్ రెడ్డి, నాయకులు దేవేందర్ రెడ్డి, పాఠశాల ప్రత్యేక అధికారి రజిత, ఇండియన్ సాఫ్ట్‌బాల్ జాయింట్ సెక్రెటరి శోభన్‌బాబు ఉన్నారు.

ఆవు, లేగదూడ పట్టివేత

తానూరు: మహారాష్ట్ర నుంచి ముథోల్‌కు ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న ఆవు, లేగదూడను శుక్రవారం రాత్రి తానూరు సమీపంలో పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాలీ ఆటోలో ఆవు, లేగదూడ అక్రమంగా తరలిస్తున్న విషయాన్ని తెలుసుకున్న హిందు వాహిని, భజరంగ్‌దళ్ కార్యకర్తలు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సందీప్‌తో పాటు పోలీసులు మహాలక్ష్మి ఆలయం సమీపంలో ఆ ఆటో ట్రాలీని పట్టుకున్నారు. ఆవును, లేగదూడను శనివారం భైంసా గోశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపాడు.

ఉద్యోగి ప్రాణం తీసిన వేధింపులు!

జన్నారం: సెలవుల విషయంలో వేధింపులు ఓ ఉద్యోగి ప్రాణం తీశాయి. వేధింపులతో మనస్తాపంతో పురుగుల మందు తాగగా.. చికిత్స పొందుతూ శనివారం చనిపోయాడు. ఈ సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మృతుడి తల్లి సరస్వతి, ఎస్సై సతీష్ వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా కడెం నీటి పారుదల శాఖ కార్యాలయంలో జన్నారం మండల కేంద్రానికి చెందిన తోకల రాకేష్(37) టెక్నికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. అతడి తండ్రి మూడు నెలల క్రితం చనిపోయాడు. సెలవుల విషయంలో అదే కార్యాలయంలో పని చేస్తున్న సూపరింటెండెంట్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ వేధింపులకు గురిచేశారు. ఈ విషయం తన కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. ఇటీవల కాలంలో రాకేష్ తండ్రి మూడు నెలల కర్మ కోసం సెలవు అడగడంతో వారు నానా విధాలుగా దుర్భాషలాడారు. దీంతో మనస్తాపం చెందిన రాకేష్ గురువారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా శనివారం ఉదయం చనిపోయాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు నీటి పారుదల శాఖ సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ మోటార్ల వైర్లు చోరీ



మాట్లాడుతున్న బాధిత రైతులు

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి గ్రామానికి చెందిన రైతుల విద్యుత్ మోటార్లకు సంబంధించిన వైర్లు చోరీకి గురవుతున్నాయి. వారం రోజులుగా గ్రామంలోని గోదావరి తీరంలో సుమారు 10మంది రైతులకు చెందిన వైర్లు చోరీకి గురయ్యాయని బాధిత రైతులు శనిగారపు ప్రసాద్, జెట్టి భూమేష్, అంబటి సంపత్ శనివారం తెలిపారు. తమతో పాటు గ్రామంలోని అడ్వాల భూమన్న, కమ్మల ప్రసాద్, అడ్వాల రమేష్‌లకు చెందిన వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తు కెళ్తున్నారని వాపోయారు. ఒక్కో రైతుకు సంబంధించిన వైరు విలువ సుమారు రూ.10వేలు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎత్తుకెళ్లిన వైరును ఒక చోట చేర్చి కాల్చి అందులోని రాగి వైరును విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఆరు నెలలుగా ఇదే తరహాలో వరుస చోరీలు జరుగుతున్నాయని వాపోయారు. ఇప్పటికైనా చోరీలను నియంత్రించాలని అధికారులను వేడుకుంటున్నారు.

ఫిర్యాదుపై విచారణ



పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారి ప్రశాంత్ పాటిల్

బేల: మండలంలోని బాది అటవీ శాఖ సెక్షన్ పరిధిలోని మశాల(కె) అటవీ ప్రాంతంలో టేకు చెట్ల స్మగ్లింగ్, అటవీ బండరాళ్ల సంపద వ్యాపారం చేస్తున్న మడావి పోతు, దీనికి సహకరిస్తున్న బేల అటవీ రేంజ్ అధికారి అరుణ, సెక్షన్ అధికారి రవి, బీట్ అధికారులపై శనివారం జిల్లా కేంద్రంలో జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ పాటిల్‌కు జంగుబాయి దేవస్థానం కమిటీ మశాల(కె) బృందం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఆ జిల్లా అధికారి సంఘటన స్థలానికి టాస్క్‌ఫోర్స్ బృందంతో వెళ్లి టేకు చెట్ల నరికివేత, స్మగ్లింగ్, బండరాళ్ల వ్యాపారం, తదితర అంశాలపై పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే పూర్తిస్థాయి విచారణ చేసి, నిజనిర్ధారణ సమగ్రంగా పూర్తిచేసి, ఆ తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట జంగుబాయి దేవస్థానం కమిటీ సభ్యులు మర్స కాశిరాం, ఆడ శంకర్, కుంర హన్మంతు, చిక్రం సంభు, చిక్రం మహేందవ్ ఉన్నారు.

ఒకరి ఆత్మహత్య

బేల: మండలంలోని సోన్‌ఖాస్ గ్రామానికి చెందిన పెట్కులే సంతోష్(22) శనివారం గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. పెట్కులే సంతోష్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. నిత్యం ఇంట్లో భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకుని మృతిచెందాడు. మృతికి కారణాలు తెలియరాలేదు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య దివ్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో జూనియర్ అసిస్టెంట్ మృతి



స్వామి.(ఫైల్)

తాంసి: రోడ్డు ప్రమాదంలో జూనియర్ అసిస్టెంట్ మృతిచెందిన సంఘటన మండలంలోని పొన్నారి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... పొన్నారి గ్రామానికి చెందిన మలపతి స్వామి(39) తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో ఇంటి నుంచి పంట చేనుకు నడుచుకుంటూ వెళ్తుండగా గ్రామ సమీపంలో గుర్తు తెలియని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన స్వామిని స్థానికులు చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించాలని వైద్యులు సూచించడంతో అర్ధరాత్రి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహన్ని ఏఎస్సై కేశవ్ స్వామి పరిశీలించి పంచనామా నిర్వహించారు. మృతుడి సోదరుడు ఆశన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపాడు. మృతునికి భార్య రజిత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

'కడెం' మరమ్మతుకు నిధులు



ప్రాజెక్ట్ వైరింగ్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది(ఫైల్)

- ఎలక్ట్రికల్ వ్యవస్థ పునరుద్ధరణకు రూ.3.81 కోట్లు
- ఈనెల 22న టెండర్ ఖరారు
- తీరనున్న విద్యుత్ సమస్యలు

కడెం: రెండేళ్లుగా వానాకాలంలో వచ్చిన భారీ వరదలకు దెబ్బతిన్న కడెం ప్రాజెక్టు మరమ్మతులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇటివలే ప్రాజెక్టు వరద గేట్ల మరమ్మతుకు రూ.5.46 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం తాజాగా, ఎలక్ట్రిక్ వ్యవస్థ పునరుద్ధరణ కోసం రూ.3.81 కోట్లు మంజూరు చేసింది. ఈమేరకు ఈనెల 15న జీవో విడుదల చేసింది. ఈనెల 22 నాటికి టెండర్ ప్రక్రియ ముగించి పనులు ప్రారంభించేలా నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఎన్నాళ్లకో..

కడెం ప్రాజెక్టు నిర్మించి 60 ఏళ్లు గడుస్తున్నా నేటికీ అప్పటి విద్యుత్ వ్యవస్థతోనే నెట్టుకొస్తున్నారు. ప్రాజెక్టు నిర్వహణలో విద్యుత్ వ్యవస్థ కీలకమైంది. వైరింగ్ వ్యవస్థ పని చేయక పలుమార్లు గేట్లు ఎత్తలేని పరిస్థితి నెలకొంది.అప్పటి వైరింగ్, ప్యానెల్ బోర్డ్స్, లైటింగ్ వ్యవస్థలతో తరచూ ఇబ్బందులు త లెత్తుతున్నాయి. ఇరిగేషన్ అధికారులు వరద గేట్ల పట్టించుకుని, ఎలక్ట్రికల్ వ్యవస్థపై దృష్టి పెట్టడం లేదు.

విద్యుత్ సమస్యలు తీరుతాయి



కడెం ప్రాజెక్టు విద్యుత్ వ్యవస్థ చాలా ఏళ్ల క్రితం నాటిది, మరమ్మతులు లేక ప్రస్తుతం అస్తవ్యస్తంగా మారింది. ఇటీవలే ప్రాజెక్టు విద్యుత్ వ్యవస్థను పూర్తిగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం. ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసింది. టెండర్ పూర్తికాగానే వానాకాలం నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– నాగేశ్వరావు, ఏఈఈ, ఎలక్ట్రికల్

విద్యుత్ వ్యవస్థ ఆధునికీకరణ

కడెం ప్రాజెక్టుకు మొత్తం 18 వరద గేట్లు ఉన్నాయి. వీటిని అపరేట్ చేసేందుకు 450 కిలోవాట్ సామర్థ్యం ట్రాన్స్‌ఫార్మర్ అవసరం, కానీ అక్కడ 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మాత్రమే ఉంది. అది కూడా గ్రామానికి లింకు ఉండడంతో తరచూ విద్యుత్ అంతరం ఏర్పడుతుంది. పనులు ప్రారంభించి, విద్యుత్ వ్యవస్థ ఆధునికీకరిస్తే సమస్యలు తీరనున్నాయి. ప్రాజెక్టు వద్ద 500 కిలోవాట్ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్, ప్రస్తుతం ఉన్న 100 కేవీ జనరేటర్‌తోపాటుగా, 160 కేవీ సామర్థ్యం గల మరో నూతన జనరేటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. అలాగే కేబుల్స్, వైరింగ్, ప్యానల్ బోర్డ్స్, లైటింగ్ సిస్టం ఆధునికీకరిస్తారు.

ఆదర్శ రైతు రామేశ్వర్‌కు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న గాయక్‌వాడ్ రామేశ్వర్

ఇచ్చోడ: మండలంలోని నవేగావ్ గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు గాయక్‌వాడ్ రామేశ్వర్ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా శనివారం హైదరాబాద్‌లోని మాదపూర్ హైటెక్ సిటీలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ రైతు అవార్డును అందుకున్నాడు. గ్రామ భారతి కిసాన్ ఎక్స్ పో వారి ఆధ్వర్యంలో శనివారం కిసాన్ మేళా నిర్వహించారు. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా ఆదర్శ రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ రైతులకు అవార్డులు అందచేసినట్లు రామేశ్వర్ తెలిపారు. రామేశ్వర గత పదేళ్ల నుంచి సేంద్రియ వ్యవసాయం ద్వారా వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నాడు.

23న మహాసభ

భైంసాటౌన్: వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో పనిచేస్తున్న కార్మికులకు హక్కుల సాధన కోసం ఈనెల 23న భైంసాలో యూనియన్ మహాసభ నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ తెలిపారు. పట్టణంలోని హమాలీ యూనియన్ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డుల్లో పనిచేస్తున్న హమాలీలు, దడ్‌వాయిలు, చాటావాలాల సమస్యలు పరిష్కరించాల ని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఇన్సూరెన్స్, బోనస్, పెన్షన్ కల్పించాలని కోరారు. ఈ మేరకు కా ర్మికుల సమస్యలపై అవగాహన కల్పించేందు కు యూనియన్ మహాసభకు రాష్ట్ర, జిల్లా నా యకులు హాజరవుతారని తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చే యాలని కోరారు. హాజి, బి.శివాజీ, పి. ము త్యం, బి.సందేశ్, సట్వాజి, రాజుబాయి, పొ త్తూరి సావిత్రిబాయి, విఠల్, సలీం తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్లకు మరమ్మతులు



ఉక్కపోత... రోగుల అవస్థ.. అనే శీర్షికన సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి రిమ్స్ డైరెక్టర్ స్పందించి అక్కడున్న ఫ్యాన్‌లకు మరమ్మతు చేయించారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్